# చక్!

ఆ ఇంట్లో వాడే హీరో! వాడికి అమ్మ దగ్గర గారం! వాడి దృష్టిలో కేవలం సంపాదించటానికే జీవితాన్ని అంకితం చేసిన గానుగెద్దు డాడీ!

ఎవరిమాటా వినడు. ఎవరినీ లక్ష్య పెట్టడు. వాడు చెప్పిందే వేదం!

బ్రేక్‌ఫాస్ట్ నుంచి డిన్నర్ వరకు 'మీను' వాడు చెప్పిన అయిటమ్స్ మాత్రమే చేస్తుంది మమ్మీ!

వాడికి ఇష్టమైన ఫ్రైడ్ కర్రీస్ తప్ప మరో అయిటం ఇంట్లో ఇతర ఫామిలీ మెంబర్స్ ఎవరూ తినటానికి వీల్లేదు. అది రూలు!

పండుగ కాక పోయినా రోజూ పాయసమో... చక్కెర పొంగలో వుండాలి. తినాలన్పించి నప్పుడల్లా గారెలు విత్ అల్లం పచ్చడి చేయాలి!

వీడికి ఎప్పుడెప్పుడు ఏమేం కావాలో మమ్మీకి తెల్సు! టైమ్‌టేబుల్ ప్రకారమే మమ్మీ అన్నీ చేసి పెడుతూటుంది.

ఇంట్లో వాడో నియంత! హిట్లర్‌ని మించినవాడు! వాడి మాటే వినాలి! ఫాలో కావాలి!!

వాడికి అన్నీ తెల్సు! మేత్స్‌లో జీనియస్. జి.కె.లో ఎవరూ వాడికి సాటిరారు. చదువులో నెంబర్‌వన్నే కాదు... రాంక్ హోల్డర్!

వాడు చేసే చిలిపి పన్లకు... వేసే పోకిరీ వేషాలకు చితక్కొట్టి చట్నీ చేయాలన్పిస్తుంది. కానీ... ఎవరికీ గట్స్ లేవు... నోరెత్త లేరు.

ఆడింది ఆట... పాడింది పాట! చిన్న వయసులోనే పెత్తనాన్ని నెత్తికెత్తుకున్న కుర్రకుంక వాడు.

టి.వి. ముందు కూర్చుంటే.. చేతిలో వుండే రిమోట్‌తో సెకండుకి పది చానల్స్‌ని మారుస్తూంటాడు. ఏ ప్రోగ్రాము వాడు చూడడు... ఇతర కుటుంబ సభ్యులను చూడనీయడు. అన్నీ పిచ్చి చేష్టలే! అదొక వెర్రి ఆనందం వాడికి!

కంచంలో అన్నం పెట్టుకు తింటూ అరచేతిని నాకుతూ... వేళ్లు చీకుతూ ఒక్కోమెతుకు నాలుకకు రాసు కుంటూ వుంటాడు. ఓ పట్టాన తెమలడు. వాడి కంటూ ఓ టేస్ట్ లేదు.

నేను ఆ ఇంటిలో వున్న ఒక వృద్ధ జంబుకాన్ని. వాడు నా మనుమడు! నా జోలికి మాత్రం రాడు. నేను వాడి విషయాల్లో తల దూర్చను.. ఇద్దరిదీ చెరొక పార్టీ!!

వాళ్ల మమ్మీ ఏరోజు ఎలాంటి చీర కట్టుకోవాలో... డాడీ ఏ రోజు ఏ రంగు 'టై' కట్టుకుని

డ్రస్ చేసుకోవాలో వాడే చెప్తాడు.. కాదు నిర్దేశిస్తాడు.

ఇంటికెవరైనా గెస్ట్‌వస్తే చిరాకు పడతాడు. ఆ వచ్చిన వ్యక్తి అయిదు పని నిముషాల్లో వెళ్లక పోతే వాడు నిప్పుతొక్కినకోతే అవుతాడు. ఇల్లు పీకి పందిరి వేస్తాడు.ఇంట్లో మెంబర్లు తప్పించి మిగతా వారెవర్ని చూచినా వాడికి ఎలర్జీ!

సెల్ఫ్ డిసిప్లీన్ లేని ఇడియట్ వాడు! ఇల్లొక ఫూల్స్ పారడైజ్!

ఆ తప్పు వాడిది కాదు. ఉగ్గుపాల వయసు నుండి కంట్రోల్లో వుంచని పెంచని వాడి మమ్మీది!

'ఏ ఇంట్లోనైనా పిల్లల ప్రవర్తనకు మంచి చెడుకు తల్లే బాధ్యత వహించాలి! ఎంచేతనంటే తండ్రి అనేవాడు ఇంటి గురించి పిల్లల గురించి పట్టించుకోడు గనుక! అతగాడి దృష్టి ఎప్పుడూ సంపాదన మీదే వుంటుందికాబట్టి!!

వాడు చాలా షార్ట్ టెంపర్ ఫెలో!

ఇలాంటి కుంక రేపు పెద్ద అయిన తర్వాత ఈ సొసైటీలో ఎలా తెలివిగా బ్రతగ్గలుగుతాడో ఏమోనే దిగులు కన్న వారికి లేక పోయినా ఆ ఇంటి పెద్దగా నాకున్నది!

తల్లి ఆశలన్నీ వాడి మీదే! వాడు ఇంజనీరై అమెరికా వెళ్లాలని ఆ పిచ్చి తల్లికి ఆశ! డాలర్లు కొడుకు సంపాదిస్తుంటే చూచి మురిసి పోవాలని కలలు కంటూంటుంది. తన కొడుకు అదృష్ట జాతకుడనేసి అడిగిన వారికి, అడగని వారికీ టముకేసి మరీ చెప్తుంది.

తండ్రికి అసలు ఇల్లు పట్టదు! సర్వవేళ సర్వావస్థలయందు తన గురించే ఆలోచన! ఏ ఇతర మైన విషయాలన్నీ బుర్రకెక్కించుకోడు.

నా దృష్టిలో వాడొక విచిత్రమైన పశువు! గేదె గడ్డి తిని పాలిస్తుంది. వీడు నానా గడ్డీతిని సంపాదించుకొచ్చి పెళ్లాం దోసిట్లో పోయటం మాత్రమే తెల్సిన పూర్ ఫెలో! (సారీ గొడ్లు!)

పద్దెనిమిదేళ్లయినా నిండని పిల్ల సన్నాసి ఇంటి విషయాల్లో తలదూర్చి అందర్నీ తైతక్కలాడిస్తుంటే తనకేమీ పట్టనట్టు కళ్లప్పగించి చూస్తుంటాడు నా కొడుకు. అంటే... నాపుత్రరత్నం!!

నా మనుమడు పెద్దరికం వొలకపొయ్యటం.. దాష్టీకం చేయటం వంటివి నాకు బొత్తిగా నచ్చని విషయాలు.

నా గురించి నా భార్య గురించి ఆ ఇంట్లో ఎవ్వరికీ పట్టదు. వేళకింత తిండి పెడతారు. దట్సాల్!

వృద్ధాప్యంలో వాళ్ల నీడన వుంటున్న మాకు అంతకు మించిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదు వాళ్ల దృష్టిలో. మేము వేస్ట్ ఫెలోసుము!

అందరూ చేసేవి వేస్టు ఖర్చులే! ఎవ్వరికీ ఫైనాన్షియల్ కంట్రోల్ లేదు. అదే నా బాధ!

నా బాధ ఎవడిక్కావాలి ఆ ఇంట్లో?

ఇంట్లో మెంబర్లందరికీ సెల్ ఫోన్లన్నయ్... ఏడాది కోమారు నేను లాండ్‌లైను ఫోన్ వుపయోగిస్తే నా మనుమడు ఒంటికాలి మీద లేస్తాడు.అనవసరమైనకాల్స్ చేసి డబ్బు తగలేస్తారెందుకంటాడు? నాకు మాట పడి పోయినట్టవుతుంది.

'నీకు నీ తమ్ముడికి చెల్లెలుకి ఎందుకురా సెల్‌ఫోను స్కూలు కెళ్లేపిల్లసన్నాసులకి? అని అంటే 'స్టేటస్ సింబల్ తాతయ్యా' అంటూ కాలరెగరేస్తాడు.

నేనొక్కడినే ఏ స్టేటస్సూ లేనివాడిని ఆ ఇంట్లో!

కొడుకు కారుకొని నిండా ఏడాది కాలేదు. అది బాగోలేదు... నచ్చలేందంటాడు నా మనుమడు.

కొత్తకారు కొనే దాకా తండ్రిని వేధించాడు. లేకుంటే నిరాహార దీక్ష చేస్తానంటూ బెదిరించాడు. తల్లి మనసు విలవిల్లాడింది. తండ్రి కాదనలేకపోయాడు.

ఎంత సంపాదిస్తున్నా.. వాడు... అదే నా కొడుకు వేళకి కడుపు నిండా తిండిక్కూడా నోచుకోలేధు. డయట్ రిస్ట్రిక్షన్స్! బాడిలో కొలెస్ట్రాల్ పెరక్కూడదంటాడు. ఆల్‌రెడీ షుగరు ఎటాక్ అయినందుకు లబలబలాడతాడు.

ఇంకా ఎవరికోసం వాడు కష్టపడాలి? భార్య పిల్లల కోసమేగా బ్రతుకు పోరాటం...?

పచ్చి కూరలు... నాన బెట్టిన గింజలు తింటూ వుంటే నా కడపు తరుక్కు పోతుంది. జాలేస్తుంది. లక్షలు సంపాదిస్తున్నా... కోరింది తినటానికి లేక పోయెనేని బాధ నన్ను సతమతం చేస్తూంటుంది.

మార్నింగ్‌వాక్‌లు.. జాగింగ్‌ల్లాంటి వాటి జోలికి పోడు. పోనీ యోగసనాలు నేర్చుకోరా అంటే నా మాట పెడ చెవిన పెడతాడు.

రోజులెంత మారిపోయినయ్? నేను చదువుకునే రోజుల్లో మా వూళ్లో హైస్కూలు కూడా లేకపోతే పదిమైళ్లు నడచి స్కూలికెళ్లేవాడిని. అసలు నడకంటే భయమే లేదు. మైళ్లకు మైళ్లు నడవటం సరదాగా వుండేది.

ఇప్పుడో అందరికీ అన్నీ సుఖాలే! ఆడవాళ్ల పనిమరీ హాయి! రోటితో పన్లేకుండా పోయింది. మిక్సీలు.. గ్రైండర్లూ వచ్చినయ్. కట్టెలపొయ్యి, స్టౌలతో కష్టపడనప్పుడు వంట్లోకొవ్వు పెరగక ఏం చేస్తుంది? తిన్నది అరగటానికి వ్యాయామమే మరి?

ఇప్పటికీ నాలుగైదు కిలో మీటర్లు రోజూ నడవనిదే నాకు తోచి చావదు. నాముసిల్దాని పరిస్థితి వేరు. దానికి మోకాళ్ల నెప్పులు! మంచానికే అంకితమైంది దాని బ్రతుకు!

ఇంట్లో పెద్ద వాళ్లం వున్నామనే అభిమానం గౌరవం ఎవ్వరికీ లేదు. వాళ్లతో పాటు ఇంట్లో మేముండటం పెద్ద మనుమడికి బొత్తిగా ఇష్టం లేదు. వాడి దృష్టిలో మేము 'పేరసైట్స్'

లాంటి వాళ్లం!

ఏదో పసివాడు.. తెలీక అంటూన్నాడు లెమ్మనుకుంటూవుంటాం!

మమ్మల్ని వృద్ధాశ్రమంలో చేర్పించమని వాడు వాళ్లమమ్మీతో చెప్పటం అనేకసార్లు విన్నాం! ఏమీచేయలేక ఎవర్నీ ఏమి అనలేక గుడ్లనీళ్లు కుక్కుకున్నాం!

బి.పి. పెరక్కుండా ఆవేశపడకుండా రోజులు గడిపేయటం తప్పనిసరైంది.

'అనువుగాని చోట అధికులమనరాదు' అనే పద్యం పదే పదే గుర్తు చేస్తూంటుంది. మా ముసిల్ది! నా నోరు నొక్కేస్తూంటుంది.

ఆడవాళ్లకు గల సహనంలో వెయ్యో వంతైనా మగాళ్లలో వుండదన్పిస్తుంది. నాభార్య ఏ విషయానికీ మనసుకష్టపెట్టుకోదు. కళ్ల నీళ్లుపెట్టుకోదు.

ఇంట్లో ఏది పెడితే అది తినాలి! అది కావాలి ఇది కావాలి అంటూ.. ఈ వయసులో గొంతెమ్మ కోరిక ఎమిటి? అంటుంది. అక్కడితో నానోరు మూతపడుతుంది. స్వేచ్ఛలేదు. అన్నీ చంపుకుని బ్రతుకు వెళ్లదీస్తున్నాం.

కొడుకు స్వీట్సో ఫ్రూట్సో తెస్తే అవి మాదాకా రావు. తెలీనట్లు వుండాల్సిందే! వాళ్లు తినగా మిగిలినవి పారేయనన్నా పారేస్తారు గానీ...తినండీ అంటూ మా చెతుల్లో పెట్టటానికి కోడలికి మనసు రాదు.

మేం వుంటోంది ఇల్లులా అన్పించదు. బస్టాండో... రైల్వే స్టేషనో నయమన్పిస్తుంది. ఎప్పుడూ అరుపులు.. కేకలు! నిమ్మళంగామాట్లాడటం ఎవ్వరికీ తెలీదు.

క్రికెట్ మేచ్‌ల సీజనైతే మరీ చావుకొస్తుంది. ఇంటిల్లిపాదీ తామే బ్యాటింగ్... బౌలింగ్ చేస్తున్నట్టు ఈరంగమేస్తారు. రణగొణ ధ్వని రావణాగోల! మనసుకి ప్రశాంతత వుండదు.

ఆరోజెందుకో కొడుకు ఎర్లీగ ఇల్లు చేరుకున్నాడు.

అప్పటికే క్రికెట్ మాచ్ మంచి రసపట్టులో వుంది. కేకలతో ఇంటి కప్పు ఎగిరి మీద పడుతుందేమోన్పిస్తుంది.

వాడు ఇంట్లోకి వచ్చీ రాగానే సోఫాలో వాలిపోయాడు. మనిషి బాగా అలిసిన వాడిలా అవుపించాడు.

ఇంతలో సెల్ రింగ్ టోనొచ్చింది. నడుము బెల్ట్‌కున్న సెల్ చేతిలోకి తీసుకున్నాడు.

ఇంట్లో గోలతో కాలింగ్ పార్టీ వాయిస్ విన్పించటం లేదో ఏమో వాడు అసహనంగా వున్నాడు. టి.వీ. సౌండ్ తగ్గించమని కొడుకు మీద కేకలేసాడు.

అలా కేకలేస్తారెందుకంటూ కోడలు నామనుమడ్ని వెనకేసుకొస్తూ మాట్లాడింది. మొగుడి మీదకి ఒంటికాలు మీద లేస్తూ...

అసలేమంచి మూడ్‌లో లేడో ఏమో నా కొడుకు కోపం తారా స్థాయికి చేరుకుంది. వాడిలో అంత కోపం విసుగు నేనెన్నడూ చూడలేదు.

తండ్రీ కొడుకులు 'షటప్' అంటే 'యూ షటప్' అనుకున్నారు.

పెద్ద చిన్న తారతమ్యం తెల్సుకోకుండా మనుమడు వాళ్ల డాడీని సర్రన సమీపించి చేయెత్తి కొట్టబోయాడు.

ఆ దృశ్యం చూచిన నాకు వళ్లుమండింది. నాలో పొంగి పొరలే ఆవేశాన్ని అణుచుకోలేక పోయాను. అక్కడే సోఫాలో వున్న నేను లేచి మనుమడి స్పీడ్‌కి అడ్డుకట్ట వేస్తూ వాడి ఆచెంప ఈ చెంపా వాయించాను.

'రాస్కెల్. వాడు నా కొడుకురా!... నీకు తండ్రి! వాడినే కొట్ట బోతావా? కన్నతండ్రి మీదే తిరగబడేటంత పెద్దవాడివైనా నీవు? - నువ్విలా తయారవటానికి కారణం మీ అమ్మ! అమెగారి పెంపకం తీరు ఇట్లా ఏడ్చింది..' అంటూ ఆవేశంతో వూగిపోయాను.

నా చర్యకి అక్కడి వారంతా దిగ్భ్రాంతికి లోనైనారు.

'నేను నీ తాతయ్యనిరా! ఈ చేతుల్తో నిన్ను ఎత్తుకుమోసాను. నా గుండె మీద ఆడుకున్నవాడివి.

అప్పుడు నీ పసి చేష్టలు ఆనందించాను. ఇప్పుడు నా కళ్ల ఎదుటే నా కొడుకుని కొట్ట బోవటం చూస్తూ సహించలేక పోతున్నాను?..ఇకనైనా బుద్ధి తెచ్చుకుని క్రమశిక్షణ డెవలప్ చేసుకో పార్థూ!-మనుమణ్ని మందలించాను.

వాడు ఏమనుకున్నాడో ఏమో రయ్‌న మెట్లెక్కి మేడమీదికెళ్లాడు.

చాలా సేపటి వరకు పార్థుతో ఎవ్వరూ మాట్లాడలేదు.

రాత్రి పదిగంటల వేళలో వాడు నా గదిలో కొచ్చి నా కాళ్లమీద పడి 'నన్ను క్షమించు తాతయ్యా.. తెలీక తొందరపడ్డాను. నాలో మంచి చెడు అనే విచక్షణాజ్ఞానం లేక పోయింది. చైల్డిష్‌గా బిహేవ్ చేసాను. ఐ యామ్ ఎ ఫూల్... అంటున్న మనుమడి కళ్లు అశ్రుపూరితాలైనయ్.

లేచి కూర్చొని వాడిని కౌగిలించుకున్నాను. 'నీది లోకం తెలియని వయస్సు! నీలో తొందర పాటు దుడుకు తనం ఎక్కువ! నీలో మార్పు వచ్చినందుకు నాకెంతో గర్వంగా వుంది. ఫో... వెళ్లి భోజనం చేసి పడుకో..' మనుమడి వీపుని నిమిరాను.

'నువ్వయినా నా బిహేవియర్ 'చక్'చేసి నందుకు థాంక్సు తాతయ్యా.. ఇక నుంచి నేను నీ పార్థీ బావురు మన్నాడు.

అక్కడితో ఇంట్లో అందరూ శాంత పడ్డారు.

-:(సమాప్తం):-